కాల్పనికి కథా ఇది... కాదు.. కాదు.. నడుస్తున్న చరిత్ర!

# ఊయల పాటలు


— కె. ఇందిర

అప్పుడే తల్లిగర్భంలోంచి బయటపడ్డాను. భూమి మీద జన్మించినందుకు సంతోషమో, దుఃఖమో కాని మొదటిసారిగా నా నోటి నుండి శబ్దం వచ్చింది. 'వూ, ఆ, వూ, ఆ' అని. ఇన్నాళ్ళూ ప్రశాంతంగా మాతృగర్భంలో వెచ్చగా ముడుచుకొని పడుకున్న నాకు శబ్దాల అర్థాలు తెలియవు. రెండు రకాల స్వరాలు అవి. 'ఆడపిల్ల'' అని మంత్రసాని గాబోలు అంది.

"అమ్మో మళ్ళీ ఆడపిల్లేనా!" నీర్సంగా అంది ఇంకో స్వరం. ఇది అమ్మ స్వరమే. అమ్మ కడుపులో వుండగా నేను ఆ గొంతు వింటూ వుండేదాన్ని.

"మళ్ళీ ఆడపిల్లేనా, నాకు తెలుసు నువ్వు మొగపిల్లవాడిని కనిచస్తావా' అని ఇంకో శబ్దం కర్కశంగా వినిపించింది.

"అత్తయ్యా! అది దేవుడి చేతుల్లో వుంది. నా చేతుల్లో వుంటే మొగపిల్లవాడినే కనే దాన్ని'' బాధగా అంది అమ్మ



"ఇది మూడో ఆడపిల్ల. నాకు తెలుసు ఏం చేయాలో.'' విసురుగా బయటకు వెళ్ళింది ఆ స్వరం.

నా బొడ్డుకోసి వెచ్చని నీటిలో నన్ను కడిగి, మెత్తని పాత్తిళ్ళల్లో చుట్టి నన్ను పడుకోబెట్టింది మంత్రసాని. ఆ స్పర్శ వెచ్చగా, హాయిగా వుంది. అవును ఇది అమ్మే. అమ్మ ప్రక్కనే పడుకొని వున్నాను. పువ్వులాంటి అమ్మ స్పర్శ హాయిగా వుంది. అమ్మ చేతులు నన్ను అక్కున చేర్చుకున్నాయి.

ఒకసారి భగవంతుడిని అడిగాను 'అమృతం రుచి చూపించవా' అని అప్పుడన్నాడు భగవంతుడు "దేవతలంతా స్వార్థపరులు, అమృతాన్ని పూర్తిగా తాగేశారు. నీకు నిజమైన దేవతిచ్చే అమృతాన్ని రుచి చూపిస్తాను. భూలోకంలో జనించు, మాతృదేవోభవ' అంటూ తల్లి స్తనాల్లోంచి పుట్టే క్షీరామృతాన్ని తాగు. ఆ అమృతమే రుచికరమైనది. ఆరోగ్య ప్రదమయింది. నువ్వు ఆడపిల్లగా జన్మించి, నీ పిల్లలకు అమృతం పంచు'' అంటూ నన్ను ఆడపిల్లగా ఈ భూమి మీద పడేశాడు.

ఆ కోరిక ఈ రోజుకు

తీరింది. తృప్తిగా ఆ అమృతాన్ని తాగుతూ, నా బుల్లి చేతుల్తో అమ్మ ముఖాన్ని తడుముతూ వున్నాను. మళ్ళీ ఏవో శబ్దాలు. మంజులంగా సరళమైన శబ్దాలు.

"చెల్లి ఎంత బాగుందో రోజాపువ్వులా"

"అవును.. మల్లెపువ్వులా"

చిన్న చిన్న చేతుల చల్లని స్పర్శ నాకు తగులుతోంది. ఈ స్పర్శతో నాకు పరిచయం వున్నట్లు అనిపించింది. అదే రక్త స్పర్శ. మేము ముగ్గురం ఏక గర్భజనితులం. వీళ్ళిద్దరూ నాకు అక్కలన్నమాట. కళ్ళు విప్పి వాళ్ళతో ఏదో మాట్లాడని నోరు తెరిచి ఏదో అనబోయాను. సంతోషంతో నవ్వాను.

"అమ్మా చెల్లినన్నే చూస్తోంది. ఎంత బాగా నవ్వుతోందో" పెద్దక్క సంతోషంతో నన్ను ముద్దు పెట్టుకుంది.

నాకనిపించింది, ఇప్పుడే లేచి నడిచి అక్కలతో 'అల్లీ బిల్లీ' ఆడుదామా అని. కాళ్ళూ చేతులూ ఆడించాను. కాని లేవలేకపోయాను. నా ప్రతి కదలిక వాళ్ళకి అందంగా, వింతగా తోచిందేమో నన్ను ముట్టుకొని మురిసిపోయారు. నేనూ అందంగా పెదవులు విప్పాను.

"అబ్బ ఎంత అందంగా నవ్వుతుందో నా బంగారు పాప, వెన్నెల కురిసినట్లుగా, మల్లెలు విరిసినట్లుగా" అమ్మ గుండెలకు హత్తుకుంది ప్రేమగా. నేను పుట్టి కొన్ని గంటలయిందేమో, చుట్టూ చీకట్లు అలుముకుంటున్నాయి. అమ్మ వెచ్చని కౌగిలిలో హాయిగా ఆదమరచి నిద్రపోయాను. ఆ కౌగిలిలో నాకు ఏదో రక్షణ, నన్నెవరూ అమ్మ నుంచి వేరుచేయలేరని ధీమా. అందుకే హాయిగా నిద్రపోయాను. ఇంతలో ఎవరో బలంగా కుదిపారు. ఉలిక్కిపడిలేచాను.

"మళ్ళీ ఆడపిల్లేటగా సిగ్గులేదూ నీకు. పై ఇద్దరి పెళ్ళిళ్ళు ఎలా చేయాలా అని కట్నం ఎలా ఇవ్వాలా అని రేయింబవళ్ళూ నేను కష్టపడుతూంటే నువ్వు తీరిగ్గా ఆడపిల్లల్ని కను..." ఆ శబ్దం మోటుగా వినిపించింది. అది మా తండ్రిదే అయి వుంటుంది. నేను అమ్మకి ఇంకా దగ్గరగా జరిగాను. మళ్ళీ అమ్మ గర్భంలోకి వెళ్ళిపోతే బాగుండేదేమో అనిపించింది.

"ఈ పాపను తీసుకొని వెళ్ళి బయట చెత్త కుండిలో పడేయి" మొరటు చేతులు నన్ను కుదిపాయి.

"పాపం, ఈ పసిపాప ఏం పాపం చేసింది. దానికి పెళ్ళి చేయక్కర్లేదు. కూలీ చేసుకొని బ్రతకనీయండి. మీ కాళ్ళు పట్టుకుంటాను" అమ్మ బ్రతిమిలాడుతూ ఏడుస్తోంది.

"పచ్చి బాలింతవి ఏడ్చి చావకు. మా అమ్మను కనుక్కుంటాను, ఈ ఆడ పిశాచిని ఏం చేయాలా అని" కోపంగా నా బుగ్గలు పిండి వెళ్ళాడు నాన్న. నాకు నొప్పి అనిపించింది. ఏడ్వడం మొదలెట్టాను. "నా పాప, బంగారు పాప ఏడవకే. అయినా నా కడుపులో మూడో పిల్లగా ఎందుకు పుట్టావే. ఇంకెక్కడైనా పుట్టి వుంటే బాగుండేది. నిన్నెలా రక్షించుకోవాలో ఈ రాక్షసుల చేతుల్లోంచి" అమ్మఏడుస్తూ నన్ను హత్తుకొని పాలివ్వ సాగింది.

మధురమైన అమృత ధారలు నా నోట్లో పడుతున్నాయి. ఎవరో పక్కకి లాగారు. అమృత భాండాన్ని లాగిన రాక్షసుల చేతుల్లాగా వున్నాయి.

"అత్తా వద్దు ఈ పాపని వదిలి వేయండి. బొమ్మలా, అందంగా వుంది. దాని బ్రతుకును దాన్ని బ్రతకనీయండి" అమ్మ ఏడుస్తోంది.

"అందంగా వున్నంత మాత్రాన దాన్ని, కట్నం లేకుండా ఏ మగాడు పెళ్ళి చేసుకుంటాడే. నీ పిల్లల పెళ్ళిళ్ళు ఎలా చేయాలా అని నా కొడుకు అల్లాడుతుంటే, దీన్ని బ్రతికించమంటావా? మళ్ళీ తెల్లవారే లోపల గప్‌చిప్‌గా పనికానిద్దాం. పురిటిలోనే పోయిందని అందరికీ చెపితే పోలా. పీడ విరగడ అవుతుంది."

"అత్తా వద్దు, వద్దు. పాపని చంపొద్దు" అమ్మ నన్ను హత్తుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అమ్మ ఒళ్ళోంచి కంసుడిలా నన్ను లాగేశాడు మా నాన్న. మా అమ్మ బలవంతంగా నా నోటిని తెరిచి నా నోట్లో ద్రవ పదార్థమేదో పోస్తోంది. అమ్మ పాలు రుచి చూసిన నా నోటికి, అది చేదుగా అనిపించింది. తుప్పున ఉమ్మి వేశాను. మా నాన్న నా ముక్కు మూశాడు. నేను గుటకలు మింగాను. కళ్ళలో పిండింది మా అవ్వ. కళ్ళు మండి నేను కెవ్వున ఏడ్పు మొదలుపెట్టాను. నా రోదన అరణ్యరోదన అయింది. నీర్సంగా వున్నా అమ్మ




## సుప్రసిద్ధ రంగస్థల నటి



### యండమూరి అమ్మాణీబాయ్

బొమ్మ నటన, భావితరం నటీ, నటులకు బంగారు బాట. ఆ బొమ్మ మరెవరో కాదు. నాటి మేటి, నటి శ్రీమతి యండమూరి అమ్మాణీబాయ్. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో పుట్టి స్వరాష్ట్రంలోనే గాక రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా పర్యటించి ఎన్నో రసవత్తరమైన పౌరాణిక నాటకాల్ని ప్రదర్శించారీమె.

యాభై సంవత్సరాలు పైబడినా నాటక కళ పట్ల ఇంకా ఈమెకు ఉత్సాహం ఏ మాత్రం సడలలేదు. ఈమె ప్రప్రథమంగా, ప్రముఖ నటులు, గంధర్వ నాట్యమండలి స్థాపకులు శ్రీవై.భద్రాచారితో 'పరశురామ', 'రుక్మిణీ కళ్యాణం', 'పుండరీక' మొదలగు నాటకాలలో కథానాయికగా నటించి అందరి మన్ననలను అందుకున్నారు. ఈ నాట్యమండలిలోనే నటసామ్రాట్ డా॥ అక్కినేని నాగేశ్వరరావు హరిశ్చంద్రలో "మాతంగకన్య"గా అమ్మాణీబాయ్‌తో కల్సి నటించారు. అప్పటి నుండి ఈమె కొన్ని వందల నాటకాలలో ప్రముఖ పాత్రలను ధరిస్తూ ఆంధ్రుల హృదయాల్లో చిరస్థాయిగా నిల్చిపోయారు. ఈమె స్త్రీ పాత్రలనే కాక రాముడు, కృష్ణుడు, నారదుడు, అశ్వత్థామ లాంటి పురుష పాత్రల్ని కూడా ప్రతిభావంతంగా పోషించారు. ప్రముఖ నటులు శ్రీకొచ్చర్లకోట రంగారావు ఈమె నటనను గుర్తించి తాను నిర్మించిన "అహల్య శాప విమోచనం" సినిమాలో అహల్య పాత్రను ఈమె చేత చేయించారు. 1953లో "రామాంజనేయ యుద్ధం" నాటక ప్రదర్శన రాజమండ్రిలో జరిగింది. ఆ నాటకంలో నారద పాత్రలో అమ్మాణీబాయి అమోఘంగా నటించారు. ఆ నాటకాన్ని తిలకించిన కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిగారు ఆమెను ప్రశంసించి నగదు బహుమతితో సత్కరించారు. ఇటువంటి సత్కారాలు, సన్మానాలు, ప్రముఖ కళా సంస్థలచేత కోకొల్లలుగా పొందారామె.

26 ఏప్రిల్ 92న కాకినాడలో ప్రఖ్యాత నాటక సంస్థ "ది యంగ్మెన్స్ హేపీ క్లబ్" వారు జరిపిన ప్లాటినం జూబ్లీకి విచ్చేసిన డా॥ అక్కినేని నాగేశ్వరరావు శ్రీమతి అమ్మాణీబాయిని సత్కరించి, నాటి సంగతులను ముచ్చటించారు.

ఈ మహానటి ప్రస్తుతం కాకినాడలో తన మనవలు - మనుమరాండ్రతో ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నారు.

**– నక్కా వెంకటేశ్వరరావు, కాకినాడ**

---

మంచం మీంచి నన్ను లాక్కోబోయింది. మా నాన్న అమ్మను నెట్టి వేశాడు. మంచం మీద స్పృహ తప్పి పడిపోయింది అమ్మ ఇంక నన్ను రక్షించేందుకు, మా అమ్మ లేవలేదు. "చావవే ఆడముండా!" అని తిట్టింది అవ్వ. ఆడదే ఆమే మరి! నేనేడుస్తుంటే నా నోరు బలవంతంగా మూశారు. ఊపిరి ఆడక గిలగిల కొట్టుకుంటున్న నన్ను పాత్తిళ్ళల్లో చుట్టి, బయటకు తీసుకొని వెళ్తుండగా, నా పెద్దక్క వచ్చింది.

"చెల్లికేమయింది. ఎక్కడికి తీసుకు వెళ్తున్నారు."

"పాపకి జ్వరం వచ్చి చచ్చిపోయింది. నువ్వు పోయి పడుకో" నాన్న అన్నాడు నిర్లిప్తంగా.

"అంతా అబద్ధం మీరే పాపను చంపేశారు. నాకు చెల్లి కావాలి" అని ఏడిచింది అక్క.

ఏడుస్తున్న అక్కను బలవంతంగా లోపలికి నెట్టి తలుపు వేసింది అవ్వ. నేను శాశ్వతంగా నా పుట్టింట్లోంచి బయటకు వచ్చేశాను. పొలం పొలిమేరలలో ముందే తవ్వి వుంచిన గోతిలో నన్ను పడేశారు. నా ప్రాణం పూర్తిగా పోకముందే నన్ను పూడ్చి పెట్టారు. అమ్మ ఇచ్చే అమృతాన్ని తనివి తీరా త్రాగకముందే, లాలపోయించుకొని జోలలు పాడించుకోకముందే, అక్కలతో 'అల్లీ బిల్లీ'లు ఆడక ముందే, నన్ను పురిటిలోనే, పుట్టిన గంటల్లోనే చంపేశారు. కాసేపటికి నా ప్రాణం పోయింది. నా ఆత్మ ఏడుస్తూ భగవానుని సన్నిధికి చేరుకుంది.

• • •

"అదేమిటి? అంత తొందరగా వచ్చేశావు. ఏం అమృతం బాగా లేదా?" ఆప్యాయంగా అడిగాడు దేవుడు.

"అమృతం అమ్మలాగా వుంది. అమృతం తృప్తిగా తాగకముందే విషం చవి చూశాను. నాకు అమ్మ దగ్గర యింకా బ్రతకాలని వుంది. కానీ చంపేశారు" వెక్కిళ్లూ పెడుతూ ఏడ్చేశాను.

"పాపం, పిచ్చిపాప అమృతాన్ని రుచి చూడదల్చుకున్నప్పుడు విషం కూడా చవి చూడక తప్పదు. ఆ శివుడు కనుక గరళ కంఠుడిగా వుండిపోయాడు కానీ, భూమి మీద మరణం తప్పదు. అదిగో చూడు నీ లాగా పొత్తిళ్ళ పాపలు వస్తున్నారు. వాళ్ళిద్దరూ కవలలు. ఆడపిల్లలు కావడంవల్ల ఇద్దరూ ఒకేసారి వచ్చేశారు."

"కన్నవారే ఈ పురిటికందులని అందులో ఆడపిల్లల్ని చంపడానికి కారణం ఏమిటి భగవంతుడా. నువ్వు ఈ భ్రూణ హత్యలను, ఎందుకు ఆపడం లేదు." ఏడుస్తున్న కవలలతోపాటు ఏడుస్తూ అడిగాను.

"ఒకటి పేదరికం, రెండోది వరకట్నం. వరకట్నం రాక్షసిలాగా విలయతాండవం చేస్తోంది. ఆడపిల్లల్ని పురిటిలోనే స్వాహా చేస్తోంది. కొంత మందిని పెళ్లి అయిన తరువాత చిత్రహింసల పాలు చేసి కాల్చుకొని తింటోంది. మనుషుల్లోనే మార్పు వచ్చి అది అంతం అవ్వాలి. ఈ లోపల నీలాంటి శిశువులు కర్కశంగా బలికాకుండా ఏదో ఒకటి చెయ్యాలి."

కొన్ని రోజులు గడిచాయి. ఈ లోపల ఇంకో పది పాపలు మాలో చేరారు. ఒకరోజు భగవంతుడు ఒక దృశ్యం చూపాడు. ఒక ఆసుపత్రి ముందు ఊయల ఊగుతోంది. ఎవరో ఒక మనిషి బహుశా తండ్రి అయి వుంటాడేమో ఒక పొత్తిళ్ళ పాపను తెచ్చి ఎవరూ చూడకుండా అందులో పడుకోబెట్టి పారిపోయాడు. పోన్లే చంపకుండా బ్రతకనిచ్చాడు, అనుకుని ఆ పాపను చూడటానికి నేను ఊయల దగ్గిర కొచ్చాను. పాపం ఈ పాప కూడా తల్లి పాలు నోచుకోలేదు. తల్లి చేత లాలపోయించుకొని జోల పాడించుకోలేదు. ఆడపిల్లగా పుట్టిన ఖర్మానికి అనాథగా మిగిలింది. అందుకే అన్నారా పెద్దలు-

"ఆడపిల్లగా పుట్టేకంటే అడవిలో మానై పుట్టడం మంచిద"ని. ఊయలలోని పాప 'మూ ఆ వూ ఆ' ఏడ్వ సాగింది. అమ్మ చేత జోల పాడించుకోలేదు ఆ పాప. నేను పాడసాగాను. ఎవరూ వినలేని ఆ పాట పాపకు వినిపించే ఆ గాథ.

"లాలీ, లాలీ ఊయల ఊగవే పాప
ఆడపిల్లగా, తల్లిదండ్రులకు బరువైన చెల్లీ
ఇక్కడ వర్థిల్లు కల్పవల్లీ.
వరకట్నం ఆశించని వరుడు దొరికే వరకు
ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగినిగా బ్రతుకు
చావు తెచ్చే ఆ కట్నపు పెండ్లి కంటే
కన్నె పిల్లగా కలకాలం వర్థిల్లు
ఊయలపాప ఊగవే ఊయల
లాలీ. లాలీ.. లాలీ... లాలీ...."

పాప చిరునవ్వు నవ్వుతూంది. ఇంతలో ఒక మమతామూర్తి- మాతృమూర్తిగా ఆ పాపను తన ఒడిలోకి తీసుకుంది. కాసేపటికి ఖాళీగా వున్న ఊయలలో ఇంకో పొత్తిళ్ళ పాప! నా లాలీ పాట అలా సాగుతూనే వుంది.

[ఇటీవల తమిళనాడులోని ఆర్కాట్, సేలం జిల్లాలలో ఎందరో పసికందులు కేవలం ఆడపిల్లలైన కారణంగా పురిటిలోనే చంపబడిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో తమిళనాడు ప్రభుత్వం మద్రాసులోనూ, రాష్ట్రంలోని కొన్ని ప్రధాన కేంద్రాలలోనూ యిలాంటి బాలల పరిరక్షణకై 'క్రెడిల్ బేబిస్' పథకాన్ని ప్రారంభించింది. ఆ నేపథ్యంలో రాసిన కథ యిది. - రచయిత్రి]